# నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT

# రంగారెడ్డి

శనివారం 30 డిసెంబర్ 2023 | SATURDAY, DECEMBER 30, 2023 | RANGAREDDY | పేజీలు : 8 PAGES



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

# తగ్గిన నేరాలు

## వార్షిక నివేదికను వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 29 : వికారాబాద్ జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ ఏడాది క్రైమ్ రేటు తగ్గిందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో 2023 సంవత్సరానికి సంబంధించిన క్రైమ్ వివరాలను విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2021తో పోల్చుకుంటే 2022లో కేసులు తగ్గాయని, 2022తో పోల్చుకుంటే 2023లో ఇంకా తక్కువ కేసులు నమోదయ్యాయన్నారు. 2023లో మొత్తంగా 3588 కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలో 1035 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. కళాజాత బృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల్లో భాగంగా జిల్లాలో రూ.4.96 కోట్ల నగదు, బంగారం, లిక్కర్, గంజాయి పట్టుకున్నామన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లాలో 19 టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. 25 ప్రదేశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రిసార్ట్స్‌లలో అనుమతులు లేకుండా ఈవెంట్స్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


షాద్‌నగర్‌లోని ఓ కంపెనీ

# చిన్న పరిశ్రమలకు చేయూత

- బయ్యర్లు, పారిశ్రామిక వేత్తలకు వారధిగా నిలుస్తున్న టీఎస్ఎంఎస్ఈఎఫ్‌సీ
- ఏడు జిల్లాలతో కలిపి రంగారెడ్డి రీజియన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఇప్పటివరకు కౌన్సిల్ ద్వారా 753 కేసుల పరిష్కారం
- పరిశ్రమలకు రూ.474.51కోట్లు చెల్లించిన బకాయిదారులు
- కేసుల పరిష్కారంలో జాతీయస్థాయిలో ఆరో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా కౌన్సిల్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చింది. టీఎస్ఐపాస్‌తో అనతికాలంలోనే అనుమతులిచ్చి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించింది. దీంతో రంగారెడ్డి జిల్లాలో ఎన్నో చిన్న, భారీ తరహా పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి. అయితే చిన్న పరిశ్రమల ఉత్పత్తులను కొనుగోలు చేసే బయ్యర్లు డబ్బులు చెల్లించక పరిశ్రమలు మూతపడే స్థితికి చేరుకున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాలతో కలిపి గత ప్రభుత్వం రంగారెడ్డి రీజియన్ కౌన్సిల్(టీఎస్ఎంఎస్ఈఎఫ్‌సీ)ను ఏర్పాటు చేసి చిన్న పరిశ్రమలకు చేయూతనందించింది. సమస్య ఏదైనా కోర్టు వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సామరస్యంగా 90 రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నది. బయ్యర్లు, పారిశ్రామిక వేత్తలకు కౌన్సిల్ వారధిగా నిలుస్తూ మొండి బకాయిలను ఇప్పించి చిన్న పరిశ్రమలకు వెన్నుదన్నుగా నిలిచింది. ఇప్పటివరకు ఈ కౌన్సిల్ ద్వారా 753 కేసులు పరిష్కారం కాగా, రూ.474.51కోట్లను బయ్యర్లు పరిశ్రమలకు చెల్లించారు. అనతికాలంలోనే అత్యధిక కేసులను పరిష్కరించిన రంగారెడ్డి ఫెసిలిటేషన్ కౌన్సిల్ జాతీయస్థాయిలో ఆరో స్థానంలో నిలువడం గమనార్హం.

– రంగారెడ్డి, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ)

8


మహేశ్వరం తుక్కుగూడలోని ఓ కంపెనీ



# సర్కారు బడుల్లో... సౌర వెలుగులు

- వికారాబాద్ జిల్లాలో 262 పాఠశాలలు ఎంపిక
- రూ.11.25 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- పాఠశాలల్లో త్వరలో సౌర పలకల ఏర్పాటు చేయనున్న టీఎస్ రెడ్‌కో
- పాఠశాలలకు తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం

సౌరశక్తి వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. సర్కారు బడులపై విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నాబార్డ్ ఆర్థిక సహకారంతో వికారాబాద్ జిల్లాలోని 262 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, సౌర విద్యుత్తు ఉత్పత్తికిగాను ప్రభుత్వం రూ.11.25 కోట్లను కేటాయించింది. ఈ మేరకు ఎంపికైన పాఠశాలల్లో పనులు ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేయగా, టీఎస్ రెడ్‌కో పాఠశాలలకు సౌర పలకలను బిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పాఠాల బోధన, ఫ్యాన్లు, కంప్యూటర్లు, లైట్లు వంటి వాటితో ప్రతినెలా వేల రూపాయల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుతో పాఠశాలలకు విద్యుత్ బిల్లుల భారం గణనీయంగా తగ్గనున్నది.

– బొంరాస్‌పేట, డిసెంబర్ 29

7


సౌర విద్యుత్‌కు ఎంపికైన బొంరాస్‌పేట మండలంలోని చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాల